వర్షాలతో పంటలకు ఊపిరి

- విస్తారంగా కురుస్తున్న వర్షాలు
- కళకళలాడుతున్న పంట పొలాలు
- 34,142.5 ఎకరాల్లో ఖరీఫ్ సాగు


ఇప్పలపాడు సమీపంలో కళకళలాడుతున్న వరి చేను


దుద్దుకూరు వద్ద కళకళలాడుతున్న పత్తి పంట

బుట్టాయగూడెం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో పశ్చిమ ఏజెన్సీప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు వాతావరణం చల్లగా ఉన్నా రాత్రి పూట వర్షం దంచికొడుతుంది. ఒక్కోసారి రోజంతా భారీ వర్షం కురుస్తుంది. దీంతో ఈ ప్రాంతంలోని పైర్లు కళకళలాడుతున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వర్షాల జాడలేక రైతులు తీవ్ర ఆందోళన చెందారు. అయితే సీజన్ ప్రారంభం తర్వాత కొద్దిపాటి వర్షాలతో పాటు బోర్లు ఉన్న రైతులు పంటల సాగు ప్రారంభించారు. తర్వాత బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో వర్షాలు విస్తారంగా కురవడంతో వరి, మొక్కజొన్న, ప్రత్తి, పెసర్లు, మినుము, శనగలు, వేరుశనగ, నువ్వులు వంటి పంటలను రైతులు విస్తారంగా వేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పైర్లు కళకళలాడుతూ కనిపిస్తున్నాయి.

ఆశాజనకంగా పంటల సాగు

నియోజకవర్గంలోని బుట్టాయగూడెం, పోలవరం, జీలుగుమిల్లి, వేలేరుపాడు, కుక్కునూరు, కొయ్యలగూడెంతోపాటు జంగారెడ్డిగూడెం మండలాల్లో 34,142.5 ఎకరాల్లో ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేస్తున్నారు. వీటిలో వరి 29606 ఎకరాలు, మొక్కజొన్న 255 ఎకరాలు, 172 ఎకరాల్లో పెసర్లు, 2064 ఎకరాల్లో మినుము, 6 ఎకరాల్లో శనగలు, 1752 ఎకరాల్లో వేరుశనగ, 10 ఎకరాల్లో నువ్వులు, 41.50 ఎకరాల్లో పత్తి, 236 ఎకరాల్లో చెరకు పంటలు సాగుచేస్తునానరు. అయితే ప్రస్తుతం కురిసిన వర్షాలకు పంటలు కళకళలాడుతూ ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సమృద్ధిగా నీరు ఉండడంతో ఈ ఏడాది ఆశాజనకమైన ఫలితాలు వచ్చే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

సమృద్ధిగా వర్షాలు



ఈ ఏడాది సమృద్ధిగానే వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలకు ఖరీఫ్ సీజన్‌లో వేసిన పంటలు కళకళలాడుతూ కనిపిస్తున్నాయి. రైతులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది సాగులో ఆశాజనకమైన ఫలితాలు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నాం.

– కె.గంగాధరం, ఏఓ, జీలుగుమిల్లి మండలం

ద్వారకాతిరుమలలో మెడికల్ షాపు లైసెన్స్ రద్దు

ద్వారకాతిరుమల: స్థానిక ఒక మెడికల్ షాపు యజమాని నిషేధిత మందులను విక్రయిస్తూ, నిబంధనలకు విరుద్ధంగా రోగులకు వైద్యం చేస్తున్నట్టు నిర్ధారించిన డ్రగ్ అధికారులు సంబంధిత షాపు లైసెన్స్‌ను రద్దు చేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. డ్రగ్ అధికారుల కథనం ప్రకారం.. అనధికారికంగా మందులు విక్రయిస్తున్నాడన్న సమాచారంతో డ్రగ్ అధికారులు బుట్టాయిగూడెంలో కె.గణేష్ అనే వ్యక్తిని ఈ ఏడాది జులై 4న అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా ద్వారకాతిరుమలలోని శ్రీకృష్ణ మెడికల్ షాపు యజమానికి అబార్షన్ కిట్లు, సెక్స్ సామర్థ్యాన్ని పెంచే మందులు విక్రయించినట్టు చెప్పాడు. దానికి సంబంధించిన ఆధారాలను అధికారులు అతడి వద్ద సేకరించారు. అదే నెల 16న శ్రీకృష్ణ మెడికల్ షాపులో తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో గణేష్ వద్ద కొనుగోలు చేసి, ప్రజలకు అమ్ముతున్న నిషేధిత మందులకు చెందిన ఆధారాలను షాపు యజమాని నుంచి సేకరించారు. గత రెండేళ్లుగా ఈ వ్యాపారం జరుగుతున్నట్టు గుర్తించారు. దీనిపై మెడికల్ షాపు యజమానికి నోటీసు ఇవ్వగా, దానికి సరైన సమాధానం రాలేదని, దాంతో డ్రగ్ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ డీఎండీకే చక్రవర్తి ఈనెల 9న షాపు లైసెన్స్‌ను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్టు జంగారెడ్డిగూడెం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అబీద్ ఆలీ తెలిపారు. దీనిపై షాపు యజమాని హైకోర్టును ఆశ్రయించగా, కోర్టు తిరస్కరించిందని చెప్పారు.

డిజిటల్ బుక్‌తో శ్రేణులకు శ్రీరామరక్ష

- వైఎస్సార్‌సీపీ నాయకుల జోలికొస్తే ఖబడ్దార్
- మాజీ ఎమ్మెల్యే బాలరాజు హెచ్చరిక


డిజిటల్ బుక్ పోస్టర్ విడుదల చేసిన మాజీ ఎమ్మెల్యే బాలరాజు, సమన్వయ కర్త రాజ్యలక్ష్మి, తదితరులు

బుట్టాయగూడెం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన డిజిటల్ బుక్ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు శ్రీరామరక్ష అని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. బుట్టాయగూడెం మండలం దుద్దుకూరులో పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త తెల్లం రాజ్యలక్ష్మి, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన డిజిటల్ బుక్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో అక్రమ కేసులకు, అరెస్టులకు, అన్యాయాలకు గురైన వారికి అండగా ఉండేందుకు డిజిటల్ బుక్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. కూటమి నాయకులు ఎవరైనా తమ కార్యకర్తలను, సోషల్ మీడియా యాక్టివిస్టులను అక్రమ కేసుల్లో ఇరికించి అరెస్ట్ చేయాలని చూస్తే వారి పేర్లను ఈ డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 ఏళ్ల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా అనేక మంది వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులపై అక్రమ కేసులు పెట్టడంతోపాటు అరాచకాలు పాల్పడ్డారని గుర్తుచేశారు. హత్యలు, హత్యాయత్నాలు, దాడులు చేస్తూ అనేక ఇబ్బందులకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. హామీలను అమలు చేయకుండా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఇబ్బందులు పెట్టడానికే అధికారంలోకి వచ్చినట్టు కూటమి ప్రభుత్వం కనిపిస్తోందని ఆరోపించారు.

కక్ష సాధింపు చర్యలకు పాల్పడలేదు

పోలవరం నియోజకవర్గంలో ఎన్నడూలేని విధంగా కూటమి ప్రభుత్వం అక్రమ అరెస్టులు, దాడులకు పాల్పడిందన్నారు. తాను ఎమ్మెల్యేగా నాలుగు సార్లు పోలవరం నియోజకవర్గంలో పనిచేశానని, ఆ సమయంలో ఏనాడూ ప్రత్యర్థులపై కక్ష సాధింపు చర్యలను చేపట్టలేదని బాలరాజు వివరించారు. ఇటీవల బుట్టాయగూడెం మండలం కె.అంకంపాలెంకు చెందిన సోషల్ మీడియా యాక్టివిస్ట్, వైఎస్సార్‌సీపీ కార్యకర్త తెల్లం నవీన్‌పై అక్రమ కేసు పెట్టి 41 నోటీస్ ఇచ్చి సెల్‌ఫోన్ కూడా లాక్కున్నారని వివరించారు. స్థానిక ఎమ్మెల్యేపై వస్తున్న ఆరోపణల కథనాలను ఫార్వార్డ్ చేస్తే కేసు పెడతారా అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ నాయకుల జోలికి వస్తే చూస్తూ ఊరుకోమని, ఖబడ్దార్ అని బాలరాజు కూటమి నాయకులను హెచ్చరించారు. అధికార మదంతో రెచ్చిపోతే రాబోయే రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మొడియం రామతులసి, పార్టీ సీనియర్ నాయకులు ఆరేటి సత్యనారాయణ, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు తాళ్లూరి ప్రసాద్, సర్పంచ్‌లు తెల్లం రాముడు, బన్నే బుచ్చిరాజు, కుంజా వెంకటేశ్వరరావు, జోడే సత్య దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంతోనే మేలు


కార్యక్రమంలో పాల్గొన్న డీసీహెచ్ఓ పాల్ సతీష్

చింతలపూడి : మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబాలు ఆరోగ్యంగా ఉంటాయని డీసీహెచ్ఓ డాక్టర్ పాల్ సతీష్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో శనివారం స్వస్థ్ నారీ, స్వశక్తి పరివర్ అభియాన్ కార్యక్రమం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నారాయణరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. వైద్య నిపుణులు స్త్రీలకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు కొండ్రు దేవా, గుమ్మిశెట్టి భారతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చీదరాల దుర్గా పార్వతి, తాటి అప్పారావు, బోడ నాగభూషణం, చిట్టూరి ధర్మరాజు, కొత్తపూడి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

వేలం కేంద్రం పరిశీలన

జంగారెడ్డిగూడెం: స్థానిక వర్జీనియా వేలం కేంద్రాలను ఎంపీ పుట్టా మహేష్ కుమార్ శనివారం పరిశీలించారు. స్వల్ప పెనాల్టీతో అదనపు పొగాకు కొనుగోళ్లకు కేంద్ర ప్రభుత్వం అనుమతించడం వల్ల ఏలూరు జిల్లాలో వర్జీనియా పొగాకు రైతులకు దాదాపు 74 కోట్ల లబ్ధి చేకూరిందని ఎంపీ అన్నారు. కేజీకి రూ.430 ధర పలకడంతో రైతుల ముఖంలో ఆనందం కనపడుతోందన్నారు.

కార్పొరేట్లకు పాలకుల ఊడిగం


సదస్సు ఐక్యత చాటుతున్న నాయకులు

జంగారెడ్డిగూడెం: పాలకవర్గాలు ఉద్యమాలను, ఉద్యమించే వారిని అణచివేస్తూ, కార్పొరేట్లకు మేలు చేసేందుకు ఊడిగం చేస్తున్నాయని ప్రజాసంఘాల నాయకులు ఆరోపించారు. స్థానిక రోటరీ కమ్యూనిటీ హాల్‌లో శనివారం సీపీఐఎంఎల్ రెడ్‌స్టార్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఫాసిస్ట్ వ్యతిరేక రాష్ట్ర సదస్సు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సీపీఐ ఎంఎల్ రెడ్‌స్టార్ జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నకూటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయవాది ఎస్ శ్రీమన్నారాయణ, ఆహ్వాన సంఘం అధ్యక్షుడు వై.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ హిందూ భావజాలం దేశాన్ని భయానిక పరిస్థితులకు తీసుకువెళుతుందని ఆరోపించారు. మనువాద భావాజాలాన్ని ప్రజలపై బలవంతంగా రుద్దుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని రక్షించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉన్నదని పిలుపునిచ్చారు. సీపీఐ ఎంఎల్ రెడ్‌స్టార్ పోలిట్ బ్యూరో సభ్యుడు మన్నవ హరిప్రసాద్ మాట్లాడుతూ ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు అందరూ ఫాసిస్టు శక్తులకు అనుకూలరేనని ఆరోపించారు. కార్యక్రమంలో డాక్టర్ అలుగు ఆనంద శేఖర్, సీపీఐఎంఎల్ రెడ్‌స్టార్ రాష్ట్ర కార్యదర్శి అలుపుర వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు రంగనాథం, మాదేపల్లి వెంకటరత్నం, భీమవరపు సుబ్బారావు, తోట జీవన్న, పలనాడు జిల్లా నాయకులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బాలకృష్ణ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి


బొద్దు వెంకటేశ్వరరావు

చింతలపూడి : అసెంబ్లీలో హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను తక్షణ ఉపసంహరించుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా మునిసిపల్ విభాగం అధ్యక్షుడు బొద్దు వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం చింతలపూడిలో ఆయన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ బాలకృష్ణ వ్యాఖ్యలు సిగ్గుచేటన్నారు. మాజీ సీఎం జగన్, మెగాస్టార్ చిరంజీవిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బాలకృష్ణ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సొంత ఇంట్లో కాల్పులు జరిపి మెంటల్ సర్టిఫికెట్ తెచ్చుకొని కేసుల్లో నుంచి బయటపడ్డ బాలకష్ణకు జగన్‌మోహన్‌రెడ్డి, చిరంజీవిని విమర్శించే అర్హత లేదని అన్నారు.

శ్యామల మృతికి సంతాపం

లింగపాలెం: రాష్ట్ర వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా విభాగం కార్యదర్శి, కలరాయనగూడెం సర్పంచ్ చల్లగుళ్ల రవిబాబు తల్లి శ్యామల ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఆయన నివాసంలో శనివారం శ్యామల చిత్రపటానికి వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. పార్టీ ఏలూరు జిల్లా మహిళా అధ్యక్షురాలు కేసరి సరితారెడ్డి, నాయకులు సూరిబాబు, రఘు, తదితరులు శ్యామల కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఆర్థిక సాయం

కామవరపుకోట: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎస్టీలుగా గుర్తించాలంటూ మూడు రోజులుగా ధర్నా చేస్తున్న నాయకులగూడెం గ్రామస్తులకు మద్దతు తెలిపి, రూ.10,000 ఆర్థిక సాయం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రాయంకుల సత్యనారాయణ అందజేశారు. ఈ పోరాటానికి తమ పార్టీ అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని మామీ ఇచ్చారు. కార్యక్రమంలో పర్టీ శ్రేణులు సిరిశెట్టి సిద్ధిరాజు, అచ్చియ్య, కుచలపాటి మహేష్, బచ్చు సర్వేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: చోరీ ఘటనపై కేసు నమోదు చేశామని రైటర్ బాబూరావు తెలిపారు. జంగారెడ్డిగూడెం సీతానగరానికి చెందిన జల్లి మోహనరావు స్థానిక ఏరియా ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 22న ట్రెనింగ్ నిమిత్తం ఇంటికి తాళం వేసి విజయవాడ వెళ్లారు. తిరిగి గురువారం రాత్రి ఇంటికి వచ్చి చూసే సరికి తలుపు తాళాలు పగులగొట్టి, ఇంట్లోని బీరువా తెరిచి ఉంది. బీరువాలోని 2 కాసుల బంగారు వస్తువులు చోరీకి గురయ్యాయి. ఈ మేరు శనివారం మోహనరావు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేపట్టామని బాబూరావు తెలిపారు.

బాలికకు సైకిల్ అందజేత

జంగారెడ్డిగూడెం: స్థానిక జీకే చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ట్రస్ట్ వ్యవస్థాపకులు గణిత ఆనంద ప్రసాద్ నివాసం వద్ద కౌన్సిలర్ తెలగారపు జ్యోతి, ట్రస్ట్ సభ్యులు బాలికకు సైకిల్‌ను అందజేశారు. స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న కోట వైష్ణవికి అందజేశామని జీపీ ప్రసాద్ తెలిపారు.

నేడు రామానుజపురంలో వైద్య శిబిరం

కొయ్యలగూడెం: కాపు సంక్షేమ సంఘం కె9 ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు రామానుజపురం సర్పంచ్ అడపా నాగలక్ష్మి తెలిపారు. గ్రామ రామాలయం సెంటర్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వైద్య శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా తెప్పోత్సవం


పోలవరంలో తెప్పను ఊరేగిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: గోదారమ్మ చల్లగా చూడమ్మ అంటూ తెప్పోత్సవ కార్యక్రమాన్ని పోలవరంలో పాత పోలవరం ప్రాంతవాసులు శనివారం ఘనంగా నిర్వహించారు. గరగ నృత్యాలు, వాయిద్యాలు, కోలాటాల నడుమ భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం తెప్పను గోదావరి నదిలో వదిలి గోదారమ్మకు పసుపు, కుంకుమ, చీర సమర్పించి పూజలు చేశారు. నదిలో తిరిగే సమయంలో ఎటువంటి సమస్యలు లేకుండా క్షేమంగా ఒడ్డుకు చేరుకోవాలని వేడుకున్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం


దాత ప్రసన్న కుటుంబానికి బాండ్ పత్రం అందిస్తున్న కిషోర్

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఇద్దరు భక్తులు శనివారం రూ.2,01,116 విరాళంగా అందజేశారు. నల్గొండకు చెందిన విన్నకోట శ్రీలక్ష్మీ ప్రసన్న రూ.1,01,116, విజయవాడకు చెందిన శ్రీకొండ మహాలక్ష్మీ దేవి రూ.1,00,000 నిత్యాన్నదాన కార్యాలయంలో జమ చేశారు. దాత కుటుంబాలకు ఆలయ సూపరింటెండెంట్ కోటగిరి కిషోర్ విరాళం బాండ్ పత్రాలను అందజేశారు.

పోలీస్ స్టేషన్‌లో తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ రవిచంద్ర

లింగపాలెం: వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం లింగపాలెం మండలం ధర్మాజీగూడెం పోలీస్ స్టేషన్‌లో రికార్డులను జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర తనిఖీ చేశారు. పెండింగ్ ఫైల్స్ వివరాలను ఆయన ఎస్సైను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో చింతలపూడి సీఐ క్రాంతి కుమార్, ధర్మాజీగూడెం ఎస్సై కె.వెంకన్న పాల్గొన్నారు. అనంతరం ధర్మాజీగూడెం ప్రతిభ కాలేజీలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం


విరాళాన్ని ఆలయ పాలకమండలి సభ్యులకు అందిస్తున్న దాతలు

కొయ్యలగూడెం: స్థానిక తాడేపల్లిగూడెం రోడ్డులో నిర్మిస్తోన్న వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి దాతలు శనివారం రూ.1,02,222 విరాళంగా అందజేశారు. గవరవరానికి చెందిన దివంగత బహదూర్ శ్రీరాజా రాఘవరాజు వెంకటపతిరాజు మనవలు శ్రీరాజా రాఘవరాజు రాకేష్ రంగరాజు, శ్రీరాజా రాఘవరాజు వెంకటశివ సాకేత్ వర్మలు ఆలయ పాలకవర్గ సభ్యులకు చెక్కును అందించారు. వచ్చే సుబ్రహ్మణ్య షష్ఠి నాటికి ఆలయ ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్నామని పాలకమండలి సభ్యులు మేకల అన్నవరం, మంచాల వెంకయ్య నాయుడులు తెలిపారు.

'నా తండ్రి అడుగుజాడల్లో పనిచేస్తా'


చిన్నవడ్డీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బాలరాజు

బుట్టాయగూడెం: మాజీ ఎమ్మెల్యే తెల్ల బాలరాజు తండ్రి, దివంగత మాజీ జెడ్పీటీసీ తెల్లం చిన్నవడ్డీ 16వ వర్ధంతి కార్యక్రమం శనివారం బుట్టాయగూడెం మండలం దుద్దుకూరులో నిర్వహించారు. చిన్నవడ్డీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తన తండ్రి చిన్నవడ్డీ ఎంపీపీగా, జెడ్పీటీసీగా, సర్పంచ్‌గా గిరిజన ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేశారని బాలరాజు వివరించారు. ఆయన అడుగు జాడల్లో తాను కూడా పనిచేస్తానని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మొడియం రామతులసి, పార్టీ సీనియర్ నాయకులు ఆరేటి సత్యనారాయణ, తాళ్లూరి ప్రసాద్, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

వివిధ రూపాల్లో అమ్మవార్ల దర్శనం


చింతలపూడి : రేచర్లలో సామూహిక కుంకుమ పూజ చేస్తున్న భక్తులు


కొయ్యలగూడెం : కన్నాపురం దుర్గమ్మను దర్శించుకుంటున్న భవానీలు


ద్వారకాతిరుమల : కుంకుళ్లమ్మ

ద్వారకాతిరుమల: దసరా మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. శ్రీవారి క్షేత్ర దేవత కుంకుళ్లమ్మ శ్రీ లలితా త్రిపుర సుందరీదేవి అలంకారంలో శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆర్యవైశ్య కల్యాణ మండప ఆవరణలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు మహాలక్ష్మీ దేవి అలంకారంలో కనువిందు చేశారు. క్షేత్రంలోని చెరువు వీధిలో ఉన్న దసరా మండపాన్ని దేవస్థానం సిబ్బంది సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. వచ్చేనెల 2న రాత్రి ఈ మండపంలో శ్రీవారికి నిర్వహించే శమీ పూజలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనాలని ఆలయ ఈఓ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి కోరారు.

- **చింతలపూడి :** స్థానిక శివాలయంలో అమ్మవారిని బాల త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. ఆశ్రమంలోని రాజరాజేశ్వరి అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. రేచర్ల గ్రామంలో కాత్యాయనీదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. 108 మంది మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు.
- **జంగారెడ్డిగూడెం:** గ్రామదేవత గంగానమ్మ, నూకాలమ్మ, ముత్యాలమ్మ, కనకదుర్గమ్మ, వాసవీ మాతలు లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు. గంగానమ్మ అమ్మవారిని ఎంపీ పుట్టా మహేష్‌యాదవ్, కొండ్రెడ్డి కిషోర్, నంబూరి రామచంద్రరాజులు దర్శించుకున్నారు. గుర్వాయిగూడెం అయ్యప్ప ఆలయంలో కొలువైన జ్ఞాన సరస్వతికి ప్రత్యేక పూజలు చేశారు.
- **కొయ్యలగూడెం:** స్థానిక కనకదుర్గమ్మ బాలాత్రిపుర సుందరీ దేవి, కన్యకాపరమేశ్వరి మహా చండీదేవి, బయ్యనగూడెం, కన్నాపురం, వై.జంక్షన్‌లో కనకదుర్గమ్మ లలితా త్రిపుర సుందరి అలంకరణల్లో పూజలు అందుకున్నారు. కన్నాపురంలోని బుట్టాయిగూడెం రోడ్డులోని కనకదుర్గమ్మకు భవానీలు పూజలు చేశారు.


ద్వారకాతిరుమల : వాసవీమాత


చింతలపూడి : బాలా త్రిపుర సుందరీదేవి


చింతలపూడి : రేచర్ల అమ్మవారు


జంగారెడ్డిగూడెం : గంగానమ్మ


జంగారెడ్డిగూడెం : నూకాలమ్మ


జంగారెడ్డిగూడెం : ముత్యాలమ్మ


జంగారెడ్డిగూడెం : కనకదుర్గమ్మ


కొయ్యలగూడెం : కనకదుర్గమ్మ